క్లుప్తంగా

మెట్టవలసలో వైద్యసేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ యశ్వంత్ కుమార్

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామంలో డయేరియా రోగులకు ప్రత్యేక వైద్య సేవలను వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది అందిస్తున్నారు. డయేరియా లక్షణాలతో ఆస్పత్రులకు వెళ్లి తిరిగి వచ్చిన రోగులకు వైద్య తనిఖీలు చేస్తున్నారు. శనివారం కూడా ఒక డయేరియా కేసు నమోదైంది. కాగా గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ప్రత్యేక వాహనాల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. డీపీవో వేంకటేశ్వరావు, సిహెచ్‌వో శివ ప్రసాద్, సూపర్‌వైజర్ భాస్కరావు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు ఇంటింటా సర్వేను కొనసాగించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు



యూటీఎఫ్ పతాకావిష్కరణలో ఉపాధ్యాయులు

రణస్థలం: గడిచిన 50 సంవత్సరాలలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శ్రమించి ఎన్నో విజయాలు సాధించామని యూటీఎఫ్ రణస్థలం మండలశాఖ అధ్యక్షులు డి.రామారావు అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలనుశనివారం జరుపుకున్నారు. యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ 50 ఏళ్లలో చేపట్టిన ఉద్యమాలు, సాధించిన విజయాలపై ఉపాధ్యాయులు చర్చించారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు డి.కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జె.వెంకటేశ్వరి, మండల కోశాధికారి డి.కుమారస్వామి, సభ్యులు శ్రావణ్ కుమార్, కామేశ్వరరావు, గోవిందరావు, శ్రీధర్, భానుచందర్, ఆనంతలక్ష్మి ఉన్నారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం రూరల్: మంచీ చెడూ రెండూ ఇంటర్మీడియెట్‌లో మొదలవుతున్నాయని, ఈ సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని సీఐ పైడపునాయుడు అన్నారు. శనివారం మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థల్లో ఇంటర్ మొదటి సంవత్సర ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో యువత అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రంగారావు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న సురేష్

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్యాన్న దాన పథకానికి బైరివానిపేటకు చెందిన కొమనాపల్లి సురేష్ తన పుట్టిన రోజు సందర్భంగా రూ.10వేలు విరాళంగా శనివారం అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఫల్గుణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



వెంకటరమణకు చెక్కు అందజేస్తున్న ఈశ్వరరావు

రణస్థలం: చినకొవ్వాడ గ్రామానికి చెందిన పారా వాలీబాల్ క్రీడాకారుడు మైలపల్లి వెంకటరమణకు సహృదయ, పిలుపు స్వచ్ఛంద సేవా సంస్థలు రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశాయి. దీనికి సంబంధించిన చెక్కును ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు వెంకటరమణకు శనివారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. సహృదయ ఫౌండేషన్ చైర్మన్ బిందు, పిలుపు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రవి, సభ్యులు అనంద్ ఉన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

రణస్థలం: మండలంలోని బంటుపల్లి ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఈ నెల 11వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎంఎస్ఎన్ ల్యాబ్ పరిశ్రమ వారు నిర్వహించే ఈ జాబ్ మేళాకు 20 ఏళ్లలోపు, ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన పురుష అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు.



నీటిపారుదల శాఖ కార్యాలయం సమీపంలో ఉన్న ఈ బిల్డింగ్‌లే అడ్డాగా..



వంశధార కార్యాలయం సమీప అపార్ట్‌మెంట్లలోని పాడుబడిన గదులు ఇవే

అసాంఘిక అడ్డాలపై నిఘా



నైట్ బీట్ విధుల్లో టూటౌన్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది

- జీట్ బృందాలతో పాటు ఎస్ఐ, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారుల గస్తీ
- మత్తుబాబు, పేకాట బ్యాచ్‌లపై ఉక్కుపాదం

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని కొన్ని ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. అటుగా ప్రభుత్వ కార్యాలయాల పనులపై వెళ్లే ప్రజలు, స్థానికులు, అధికారులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. మత్తుబాబులు, పేకాట బ్యాచ్‌లు ఈ అడ్డాలను నిలయంగా చేసుకుని రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రి గస్తీల్లో విధులు నిర్వర్తించే బీటు బృందాలతో పాటు ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీ స్థాయి అధికారులు కూడా తనిఖీల్లో పాల్గొని అనుమానితుల వద్ద ఆధార్, చిరునామాతో కూడిన ఐడీ ప్రూఫ్‌లు తీసుకుంటూ బయటకు ఆ సమయంలో రావడంపై ఆరా తీస్తున్నారు..



రాత్రి గస్తీలో భాగంగా 80 ఫీట్‌రోడ్డులో దిశా డీఎస్పీ రుప్పా శ్రీనివాసరావు, సిబ్బంది

ఇవే అడ్డాలు..

జిల్లాకేంద్రంలోని ఇలిసిపురం మార్గంలోని జిల్లా నీటి పారుల శాఖ కార్యాలయం, కోర్టు వెనుక భాగంలోని జిల్లా భూగర్భ జలాల శాఖ కార్యాలయం సమీపంలోని ఆరు బిల్డింగులు, వంశధార కార్యాలయం క్వార్టర్స్ సమీపంలో ఉన్న పాడుబడిన అపార్ట్‌మెంట్, 80 ఫీట్ రోడ్డులోని వాంబే కాలనీ సమీప శిశుసంక్షేమ భవనం ప్రాంతం, పాత్రునివలసలోని టిడ్కో ఇళ్లు, సమీప ఫ్లాట్లే కాక ఆర్ట్స్ కళాశాల గ్రౌండులోని పాడుబడిన బీసీ హాస్టల్, రైతుబజారు పెట్రోల్ బంక్ బ్యాక్‌సైడ్ పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తున్నాయి. ఈ ప్రాంతాలోఈల మద్యం సీసాలు, సిగరెట్టు పీలికలు, మత్తుకు ఉపయోగించి పడేసి వున్న కొన్ని కవర్లు, టైర్లు గమ్ములు పేరుకుపోతుంటాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు



కఠిన చర్యలు..

నగరంలో ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగినా మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పోలీస్ బీట్లను పెట్టాం.

– కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ

పారిశుద్ధ్య కార్మికుల సేవలు నిరుపమానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం ఈఎస్‌ఐ ఆస్పత్రి, జెమ్స్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మాత్రమే కాకుండా అన్ని వేళల్లోనూ డాక్టర్లు, వైద్య సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు పాటుబడుతున్న పారిశుద్ధ్య కార్మికులు దైవ సమానులని కొనియాడారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నిత్యం అపారిశుద్ధ్య వాతావరణంలో తిరుగుతుండటంతో కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నారని, వారికి ఏ అవసరమైనా సాయం చేసేందుకు ముందుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేషు, నగర ప్రజారోగ్య ఈధికారి వెంకటరమణ, జెమ్స్ ఆసుపత్రి ఆర్‌ఎంవో ప్రవీణ్ కుమార్, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జాతీయ జెండాలతో అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎం.కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ చేసి జాతీయ జెండాలతో అలంకరించారు.

మురపాకలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను శనివారం చేపట్టారు. వీధుల్లో ఉన్న చెత్తా చెదారాలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రజలు పరిశుభ్రత పాటించాలని స్థానిక నాయకుడు పెయ్యిల లక్ష్మణరావు కోరారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



పవన్‌కు చెక్కు అందజేస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అప్‌హోల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి టొంపల పవన్ చదువు నిమిత్తం రూ.30 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు సేవా సంస్థ కార్యాలయంలో సంబంధిత చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. పవన్ రాజాంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ బ్రాంచ్ మొదటి సంవత్సరం చదువుతున్నట్టు పేర్కొన్నారు. అతని కుటుంబ పరిస్థితులు బాగోక లేకపోవటం వల్ల చదువు మధ్యలోనే ఆగిపోకూడదని అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంజూరి ఫిలిప్ తిమోతి ఆదేశాల మేరకు ఆర్థిక సాయం చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు ముంజేటి ఢిల్లీశ్వరరావు, అరుణ్‌పాల్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతే లక్ష్యంగా సాగాలి



గార :చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్‌లు

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీల ప్రగతే లక్ష్యంగా సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ముందుకు సాగాలని సామర్లకోట పంచాయతీరాజ్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల మూడు రోజుల శిక్షణతో శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలకు వచ్చే నిధులు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళికపై అవగాహన అవసరమన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వ నిధులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుంటే పంచాయతీలు ప్రగతి సాధిస్తాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు సైతం పట్టణ ప్రాంతాలకంటే ప్రగతి సాధించే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.రమాదేవి, పరిపాలన అధికారి రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

రణస్థలం: గ్రామ పంచాయతీ పరిపాలనపై కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడో రోజు శనివారం రిఫ్రెషరీ శిక్షణలో భాగంగా గ్రామ పంచాయతీ పరిపాలనపై శిక్షణ ఇచ్చారు. పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, తరలింపు, చెత్త నుంచి సంపద తయారీ, పంచాయతీ అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, ఏవో వి.ధనుంజయరావు, ఈవోపీఆర్‌డీ ఎ.ప్రభాకరరావు ఉన్నారు.



రణస్థలం: మాట్లాడుతున్న కృష్ణమోహన్

సర్పంచ్‌లకు అవగాహన

గార : చెత్త నుంచి సంపద సృష్టించేందుకు సర్పంచ్‌లు, కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ ఎం.రాము అన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో ముగింపు సందర్భంగా శనివారం బూరవెల్లి చెత్తసేకరణ కేంద్రాన్ని సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, చెత్త సేకరణ, తరలింపు, కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్తరేశ్వరుని పుష్కర ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్తరేశ్వరుడు



ఉత్సవమూర్తుల ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని ఉత్తరేశ్వరస్వామి ఆలయ పుష్కర ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను నగరంలో ఊరేగించారు. మూలవిరాట్‌కు మహాభిషేకం, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న ఈఓ వాసుదేవరావు

కాశీబుగ్గ: మందస మేజరు పంచాయతీ కేంద్రంలో దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన 112/1, 112/2, 112/3, సర్వే నంబర్లలో 4ఎకరాలు 67 సెంట్ల భూమిని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.వాసుదేవరావు శనివారం పరిశీలించారు. రట్టి గ్రామంలోని వల్లభ నారాయణ స్వామి ఆలయానికి చెందిన ఈ భూముల విలువ మార్కెట్ రేటు ప్రకారం సుమారు రూ.15 కోట్ల ఉంటుందని అంచనా. ఈ భూములు ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని తహసీల్దారుకు రాతపూర్వకంగా తెలియజేస్తామన్నారు. పరిశీలనలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నారు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- రణస్థలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల కొవ్వొత్తుల ర్యాలీ

రణస్థలం: కూటమి ప్రభుత్వం చేతులో రాష్ట్రం రావణ కాష్టాన్ని తలపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. సామాజిక మహా శిల్పంపై కూటమి ప్రభుత్వం దాడి చేసి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి చేసిన ప్రయత్నాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శనివారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకే ఆంధ్ర రాష్ట్రంలో రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చునని అన్నారు. రాజ్యాంగ విలువలు, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం కూటమి ప్రభుత్వ నియంత్రణ పాలనలో మిన్నకుండిపోవడం ప్రజాస్వామ్య విలువలకు సిగ్గు చేటని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల నాయకులు మీసాల వెంకటరమణ, డోల వెంకటరమణ, ఆబోతుల జగన్నాథం, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, చినరామినాయుడు, బవిరి రమణ, నాలుగు మండలాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం సరికాదు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విజయవాడలో ఈ నెల 8న అంబేడ్కర్ స్మృతి వనంలో శిలాఫలకంపై పేర్లను టీడీపీ రౌడీమూకలు ధ్వంసం చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి అన్నారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించే దిశగా ఆలోచన చేయాలే తప్ప వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటుచేసిన విగ్రహాలపై ప్రతాపం చూపిస్తే ప్రజాగ్రహానికి గురవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియం వద్ద రాజ్యాంగ నిర్మాత విగ్రహం వద్ద శనివారం దళిత సంఘాలు, మేధావులు, అడ్వకేట్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. విగ్రహాల తొలగింపు వంటి దుశ్చర్యలకు పాల్పడితే దళితుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ ఎస్సీ జిల్లా నాయకులు కల్లేపల్లి రామ్‌గోపాల్, మాజీ సర్పంచ్ యజ్ఞల గురుమూర్తి, జలగడుగు శ్రీను, అడ్వకేట్ పిట్ట దామోదర్, జావద్ శ్రీనివాసరావు, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెన్షనర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బుక్కూరు ఉమామహేశ్వర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకర్‌రావు, చింతల గడ్డయ్య, లోపింటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న పలు సంఘాల నాయకులు



రణస్థలంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మరింత చేరువగా యూనియన్ బ్యాంక్ సేవలు



మాట్లాడుతున్న రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్. పక్కనే డిప్యూటీ రీజనల్ హెడ్ రవి

శ్రీకాకుళం అర్బన్: వినియోగదారులకు మరింత చేరువగా యూనియన్ బ్యాంక్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ అన్నారు. శ్రీకాకుళంలోని రీజనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాగోలు, పొందూరు, మందస ప్రాంతాల్లో కొత్తగా మూడు యూనియన్ బ్యాంకు శాఖలను ప్రారంభించనున్నామని తెలిపారు. వ్యోమ్(వీవైఓఎం), సీబీడీసీ డిజిటల్ రూపీయ అనే రెండు రకాల మొబైల్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా అన్ని రకాల బ్యాంక్ లావాదేవీలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 56 శాఖల ద్వారా తక్కువ వడ్డీతో గోల్డ్ లోన్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు క్రాప్, ల్యాండ్ డెవలప్‌మెంట్, పౌల్ట్రీ, డైరీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రూ.50 వేల వరకూ ఎటువంటి సెక్యూరిటీ లేకుండా కిసాన్ తత్కాల్‌లో రుణాలు మంజూరు చేస్తామన్నారు. చిన్న పరిశ్రమల ఏర్పాటుకు 10 శాతం వడ్డీతో ఎంఎస్ఎంఈ సువిధ పథకం ద్వారా రుణాలు, మహిళలకు నారీశక్తి పథకం ద్వారా మహిళలకు రూ.10 లక్షల నుంచి రూ.రెండు కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఉద్యోగులతో పాటు ప్రైవేటు ఉద్యోగులకు కూడా కనీస వేతనం రూ.15 వేలు ఉంటే వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తామన్నారు. 333 రోజులకు అతి ఎక్కువ వడ్డీతో (8.15% వడ్డీతో) డిపాజిట్ స్కీమ్ కూడా ఉందన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ పి.రవి పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



చిన్నబజారులో తులసిమాల అలంకరణలో వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. స్వామికి పూలు, తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామికి అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలు, భక్తుల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులు శనివారం ఉదయం నగరవీధులలో హరినామ సంకీర్తనలు ఆలపించారు. అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారిని అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముందుకెళ్లని మురుగు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో హోమియోనగర్ కాలనీలో మురుగుకాలువలు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. కాలువలు దోమలకు నిలయాలుగా మారడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో విషజ్వరాలు, డయేరియా, ఫైలేరియా వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హోమియోనగర్‌లో కాలువ దుస్థితి

